అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి



కొలనూర్ పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న డీపీవో వీరబుచ్చయ్య

ఓదెల, జూన్ 5(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిత్యం పారిశుధ్య పనులు నిర్వహిస్తూ ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య అన్నారు. కొలనూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం డీపీవో తనిఖీలు నిర్వహించారు. గ్రామపంచాయతీ రికార్డులను, శ్మశాన వాటిక, అలాగే నర్సరీ కేంద్రాన్ని, డంపింగ్ యార్డును పరిశీలించారు. డీపీవో మాట్లాడుతూ నిబంధనలు పాటిస్తూ రికార్డులను జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్స వాన్ని పురస్కరించుకొని మొక్కలు నాటారు. ఎంపీవో షబ్బీర్‌పాష, కార్యదర్శి శ్రీనివాస్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

ఖని ఆసుపత్రిలో మోటార్ బిగింపు

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



ఆసుపత్రిలో మోటార్ బిగింపు

కళ్యాణ్‌నగర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నీటి తిప్పలు అనే ఆంధ్రజ్యోతి కథనానికి ఆసుపత్రి సూపరింటెండెంట్ స్పందించారు. రోగులకు నీటి కొరత తీర్చేందుకు గురు వారం కొత్త మోటార్‌ను బిగించారు. రోగు లకు, డయాలసిస్ పేషెంట్లకు నీటి కొర తను తీర్చారు. రెండు రోజులుగా ఆసుపత్రి ఆవరణలో ఉన్న మోటార్ కాలిపోయి నీరు లేక డయాలసిస్ చికిత్స నిలిచి పోయింది. దీంతో కాలిపోయిన మోటార్ స్థానంలో కొత్త మోటార్‌ను బిగించి నీటి సరఫరాను చేయడంతో రోగులు ఊపిరి పీల్చుకున్నారు.

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకం మరింత ఆలస్యం కానున్నది. ఈ పథకం ద్వారా లబ్ధిదారులను మే నెలలోగా ఎంపిక చేసి జూన్ రెండవ తేదీ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం రోజున ప్రొసీడింగ్స్ పంపిణీ చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. అయితే దరఖాస్తులు కుప్పలు తెప్ప లుగా రావడంతో నిర్దేశించిన గడువు వరకు దరఖాస్తుల పరిశీలన పూర్తి కాలేదు. దరఖాస్తుల పరిశీలన కొనసాగుతోంది.

'రాజీవ్ యువ వికాసం'

మరింత ఆలస్యం..



- వచ్చిన దరఖాస్తులు 47,613
- కేటాయించిన యూనిట్లు 10,274
- రూ.50 వేలు, లక్ష దరఖాస్తులకు ప్రాధాన్యం
- కొనసాగుతున్న దరఖాస్తుల పరిశీలన

జిల్లా వ్యాప్తంగా ఆయా కార్పొరేషన్ల ద్వారా 10,274 యూనిట్లు కేటాయించింది. ఇందులో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 4,416 యూనిట్లు, బీసీ కార్పొరేషన్ ద్వారా 4,341 యూనిట్లు, ఎస్టీ కార్పొరేషన్ ద్వారా 431 యూనిట్లు, ఈబీసీలకు 817 యూనిట్లు, మైనార్టీ కార్పొరేషన్ ద్వారా 539 యూనిట్లు కేటాయించారు. దరఖాస్తులు 47,613 వచ్చాయి. ఇందులో ఎస్సీలు 12,782 మంది, బీసీలు 30,953 మంది, ఎస్టీలు 934 మంది, మైనార్టీలు 2,944 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ పథకం ద్వారా 50 వేల యూనిట్‌కు వంద శాతం సబ్సిడీ, ఒక లక్ష రూపాయల వరకు 90 శాతం సబ్సిడీ, లక్ష నుంచి 2 లక్షల రూపాయల వరకు 80 శాతం సబ్సిడీ, 2 లక్షల నుంచి 4 లక్షల రూపాయల వరకు 70 శాతం సబ్సిడీ ప్రభుత్వం అందించనుంది. నాలుగు కేటగిరీల్లో దరఖాస్తులు వచ్చినప్పటికీ 50వేలు, లక్ష రూపాయల వరకు గల యూనిట్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికే ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఈ కేటగిరి ద్వారా ఎక్కువ మందికి లబ్ధి చేకూర్చేందుకు అవకాశం ఉండడంతో మొదట వీరికే ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అభ్యర్థుల ఎంపికలో బ్యాంక్ సిబిల్ స్కోర్ ఆధారంగా ఎంపిక చేస్తున్నట్లుగా తెలుస్తోంది.

సిబిల్ స్కోర్‌తో సంబంధం లేకుండానే లబ్ధిదారులను ఎంపిక చేయ నున్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించినప్పటికీ, అధికారులు, బ్యాంకర్లు వాటికే ప్రాధాన్యం ఇస్తున్నట్లు కనబడుతోంది. దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులు చాలామంది అధికార పార్టీకి చెందిన స్థానిక నాయకులతోపాటు ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతూ అధికారులపై ఒత్తిడి తీసుకు వస్తున్నారు.

సిబిల్ స్కోర్ బాగుంటేనే..

బ్యాంకర్లు ఏ రుణం మంజూరు చేయాలన్నా లబ్ధిదారుల సిబిల్ స్కోర్ పరిశీలిస్తారు. ప్రభుత్వం ద్వారా అమలు చేసే పథకాలైన సరే బ్యాంకర్లు సిబిల్ స్కోర్‌ను ప్రామాణికంగా తీసుకుని రుణాలు అంది స్తుంటారు. ప్రభుత్వం పెద్ద ఎత్తున సబ్సిడీ ఇస్తున్నా లబ్ధిదారుల ఎంపికలో సిబిల్ స్కోర్‌ను బ్యాంకు అధికారులు పరిశీలిస్తున్నారు. యూనిట్లు మంజూరు చేసేందుకు మరో వారం పది రోజులు పట్టే అవకాశాలు ఉన్నాయి.

మండల, మున్సిపల్ స్థాయిలో దరఖాస్తుల పరిశీలన

దరఖాస్తులను మండల స్థాయిలో ఎంపీడీవోలు, మున్సిపాలిటీల్లో కమిషనర్ల ఆధ్వర్యంలో పరిశీలిస్తు న్నారు. లబ్ధిదారుల ఎంపికకు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఒక కుటుంబంలో ఒకరికే స్వయం ఉపాధి పథకం మంజూరు చేయాలని,

మిగతా 8వ పేజీలో

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి



పర్యావరణంపై ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్

పెద్దపల్లిటౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) సమాజంలో ఆశిస్తున్న మార్పు మన నుంచే ప్రారంభం కావాలని, ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని, చెత్తను సెగ్రిగేట్ చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో కలెక్టరేట్ ఆవరణలో డీసీపీ కరుణాకర్, అదనపు కలెక్టర్ డి.వేణుతో కలిసి ఏక్ పెడ్ మాకే నామ్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి తల్లి పేరిట మొక్క నాటాలని, తద్వారా ఉష్ణోగ్రతను తగ్గించుకొని పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు ఇవ్వాలన్నారు. కలెక్టరేట్‌లోని కార్యాలయ ఆవరణలో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని సూచించారు. ఇంటి వద్ద కూడా ప్లాస్టిక్ వాడకం నివారించాలని, ప్రజలలో మనం ఆశిస్తున్న మార్పు మన నుంచే ప్రారంభం కావాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో ప్లాస్టిక్ ఏరివేత కార్యక్రమంలో అటవీ శాఖ అధికారి శివయ్య, అధికారులు, పాల్గొన్నారు.

వెంకట్రావ్‌పల్లెను ఒకే డివిజన్‌గా ఏర్పాటు చేయాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): వెంకట్రావ్‌పల్లెను ఒకే డివిజన్‌గా ఏర్పాటు చేయాలని గురువారం గ్రామస్థులు అదనపు కలెక్టర్ అరుణశ్రీకి వినతిపత్రాన్ని అందజేశారు. పంచాయతీగా ఉన్న వెంకట్రావ్‌పల్లెను రామగుండం కార్పొరేషన్‌లో విలీనం చేయడానికి అప్పటి ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదని, దీంతో పంచాయతీ ఎన్నికలు జరగలేదని తెలిపారు. అనంతరం కార్పొరేషన్‌లో విలీన ప్రక్రియ నిలిపివేయగా పదేళ్లుగా ఎన్నికలు జరగలేదని తెలిపారు. ప్రస్తుతం గ్రామాన్ని మూడు వార్డుల్లో కలిపేలా ప్రతిపాదన ఉందని, ఒకే డివిజన్‌గా ఏర్పాటు చేయాలని కోరారు. బుర్ర ముత్యాలు, సదానందం, లక్ష్మణ్, రబ్బాని, శంకర్‌నాయక్ ఉన్నారు.

వృద్ధురాలిని తప్పించబోయి - బైక్‌పైకి దూసుకెళ్ళిన లారీ - దంపతుల దుర్మరణం (6)

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి - ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం (8)

ఇందిరా మహిళాశక్తి క్యాంటిన్ ప్రారంభం



క్యాంటిన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పెద్దపల్లిటౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఇందిరా మహిళా శక్తి గ్రూపునకు కేటాయించిన క్యాంటిన్‌ను గురువారం ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా ఆసుపత్రికి వచ్చే ప్రజలు, రోగుల కోసం క్యాంటిన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహిళలకు జీవనోపాధి కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా సబ్సిడీపై ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అందరి సహకారంతో క్యాంటిన్ పురోగతి సాధించాలన్నారు. మార్కెట్ చైర్‌పర్సన్ ఈర్ల స్వరూప, నూగిళ్ళ మల్లయ్య, సంపత్, బొడ్డుపల్లి శ్రీనివాస్, ఉప్పు రాజు, బొంకూరి అవినాష్, సురేందర్, జెగదీష్, ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీధర్ పాల్గొన్నారు.

ఈనెల 14న జాతీయ లోక్‌అదాలత్



లోక్‌అదాలత్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జడ్జిలు

పెద్దపల్లిటౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని కోర్టులలో ఈనెల 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కుంచాల శ్రీమతి గురువారం తెలిపారు. లోక్ అదాలత్‌లో కేసులను రాజీ చేసుకోవాలన్నారు. లోక్‌అదాలత్ ద్వారా సమయాభావం, డబ్బులు ఆదా అవుతాయన్నారు. ప్రధాన న్యాయమూర్తి జాతీయ లోక్‌అదాలత్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కోర్టు ఆవరణలో ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల, సెక్రెటరీ స్వరూప రాణితో కలిసి మొక్కలు నాటారు. జడ్జి సునీతా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణంపై అవగాహన కలిగి ఉండి మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. పర్యావరణం బాగుంటేనే ప్రజారోగ్యం బాగుంటుంద న్నారు. బార్ అసోసియేషన్ సెక్రెటరీ శ్రీనివాస్, లోకఅదాలత్ మెంబర్ శ్రీధర్, కౌన్సిల్ శ్రీనివాస్, న్యాయవాదులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాల పెంపునకు కృషిచేయాలి



హెడ్‌మాస్టర్ల, ఎంఈవోల వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ కోయశ్రీహర్ష

పెద్దపల్లి కల్చరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సామర్థ్యాల పెంపునకు కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్లు, ఎంఈవోలు కృషిచేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం అమర్‌నగర్‌లో జరుగుతున్న హెడ్‌మాస్టర్లు, ఎంఈవోల వర్క్‌షాప్‌ను సందర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 12 నుంచి విద్యా సంవత్సరం మొదలవుతుందని, పాఠశాల ప్రారంభం నుంచే విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పెంచడంలో ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ ఆదేశించారు. ఉపాధ్యాయులు, హెడ్‌మాస్టర్లు, ఎంఈవోల శిక్షణ పూర్తయిందని, బోధన నైపుణ్యాలను మెరుగుపర్చుకొని విద్యార్థి సామర్థ్యాలను పెంచాలని సూచించారు. గత సంవత్సరం ప్రాథమిక పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్ అంత్యపరీక్షల్లో 69శాతం అచీవ్‌మెంట్ పొందారని, ఈసారి కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్లు, ఎంఈవోలు ప్రతీ నెల జరిగే కాంప్లెక్స్ సమావేశాలలో ప్రత్యేక శ్రద్ధ చూపుతూ 85శాతం అచీవ్‌మెంట్ సాధించాలన్నారు. ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంచడానికి కృషిచేయాలన్నారు జిల్లా విద్యాధికారి మాధవి, ఏఎంఓ పిఎం.షేక్, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బడి బాట

- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల పెంపే లక్ష్యం
- నేటి నుండి 19 వరకు కార్యక్రమాలు



తుర్కలమద్దికుంటలో ఇంటింటా ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్)

పెద్దపల్లి రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంపే లక్ష్యంగా విద్యాశాఖ బడిబాట కార్యక్రమం నిర్వహించేందుకు సిద్ధమైంది. శుక్రవారం నుంచి 19వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టనున్నారు. ఉపాధ్యాయులు బడిబయట బడీడు పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించనున్నారు. ప్రభుత్వ పాఠశాలలు సాధించిన ప్రగతి, ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలపై ప్రచారం చేయనున్నారు. ప్రజా ప్రతినిధులు, విద్యార్థి సంఘాలు, వివిధ వర్గాల ప్రజలను భాగస్వాములను చేస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు చర్యలు చేపట్టింది.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరేలా...

ప్రభుత్వ పాఠశాలల్లో అందించే విద్యాబోధన, కల్పిస్తున్న సౌకర్యాలు, ఉచిత యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజనం వంటి వాటిపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులు చేరే విధంగా ర్యాలీలు చేపట్టనున్నారు. పెద్దపల్లి మండల విద్యాధికారి పరిధిలో 42 ప్రాథమిక పాఠశాలలు, 13 ప్రాథమికోన్నత పాఠశాలలు, 16 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. 71 పాఠశాలల్లో సుమారు 4100 పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. అయితే ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

గతేడాది షూ, సాక్సుల పంపిణీ

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు కలెక్టర్ కోయ శ్రీహర్ష చొరవతో షూ, సాక్సులను ఉచితంగా పంపిణీ చేశారు. అన్నపూర్ణ స్వచ్ఛంద సంస్థ ఉదయం రాగిజావాను అందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇలా కార్యక్రమాలను కొనసాగిస్తూ, విద్యార్థులు పొందుతున్న ఫలితాలను ప్రజలకు వివరిస్తూ చేరే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయనున్నారు.



ఐతురాజుపల్లిలో ఉపాధ్యాయుల బడి బాట

ఎస్జీటీ ఉపాధ్యాయ యూనియన్ ఆధ్వర్యంలో..

సుల్తానాబాద్,ఆంధ్రజ్యోతి: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం యేటా బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ప్రభుత్వం నిర్వహించే బడిబాటకు ముందే ఎస్‌జీటీ ఉపాధ్యాయులు ముందస్తు బడిబాట చేపట్టారు. ఆయా పాఠశాలల్లో పిల్లలను చేర్పించడానికి ఉపాధ్యాయులు నడుం బిగించారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు గ్రామాల్లో పర్యటిస్తున్నారు. నాణ్యమైనవిద్య, ఉచిత ప్రయోజనాల గురించి వివరిస్తూ తల్లిదండ్రులు పిల్లలను చేర్పించాలని కోరుతున్నారు. ఎస్జీటీ ఉపాధ్యాయుల యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమం చేపట్టారు. యూనియన్ వారే ఒక వాహనాన్ని ఏర్పాటు చేసుకుని గ్రామాలలో పర్యటిస్తూ ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న మధ్యాహ్న భోజనం, ఉచిత యూనిఫామ్స్, పుస్తకాలు బుక్స్, తదితర వాటి గురించి వారికి వివరిస్తున్నారు. ప్రభుత్వ స్కూల్స్‌లో ఉపాధ్యాయ బృందం నాణ్యమైన బోధన అందిస్తుందని వివరిస్తున్నారు. తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలల మోజులో పడి అధిక ఫీజులు చెల్లించి ఆర్థికంగా నష్టపోకుండా ఈ కార్యక్రమం చేపట్టినట్లు సంఘం నాయకులు తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కార్యక్రమం చేపట్టగా కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రచారం ముగిసింది. పెద్దపల్లి జిల్లాలో కొనసాగుతోంది. ఏ జిల్లా నుంచి ఎవరు ఆసక్తి తెలిపినా ఆయా గ్రామాలలో ప్రచారం నిర్వహిస్తున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం

కరివేద మహిపాల్ రెడ్డి, ఎస్టీజీ రాష్ట్ర అధ్యక్షుడు

ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పని చేస్తున్న ఎస్జీటీ ఉపాధ్యాయులు పాఠశాలల బలోపేతానికి ప్రచార కార్యక్రమం చేపట్టాం. అందరి సహకారంతో వాహనాన్ని సమకూర్చుకుని గ్రామాల్లో పర్యటిస్తూ ప్రభుత్వ పాఠ శాలల ఆవశ్యకత, సౌకర్యాలు, వసతులు ఇతర ప్రయోజనాల గురించి ప్రజలకు వివరిస్తున్నాం. ప్రభుత్వం ఆధ్వర్యంలో బడిబాట ఈనెల 6నుంచి ఉండగా తాము మే 31 నుంచి కార్యక్రమం చేపట్టాం.

విద్యార్థుల సంఖ్యను పెంచుతాం

తిరుపతి రెడ్డి, ఎస్టీజీ రాష్ట్ర కార్యదర్శి



సంఘం తరపున బడిబాట చేపట్టాం. పాఠశాలల్లో ప్రభుత్వం చేపట్టిన మార్పులను ప్రజలకు వివరిస్తూ విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తున్నాం. ఇంగ్లీష్ మీడియంలో బోధన విషయాన్ని తల్లిదండ్రుల దృష్టికి తెస్తున్నాం.

మా పిల్లలను చేర్పించాం

రజని, హెచ్‌ఎం ఐతరాజుపల్లి



పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పిం చాలంటూ ఆయా గ్రామాలలో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తూనే తమ పిల్లలను ప్రభుత్వ పాఠ శాలల్లోనే చేర్పించాం. ప్రభుత్వ సదుపాయాలను విని యోగించు కోవాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం. బడి ఈడు పిల్లలను చేర్పిస్తున్నాం. పిల్లలకు నాణ్య మైన బోధన అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నాం.



విద్యార్థులనే చేర్పించడమే లక్ష్యం

సట్టు కనుకయ్య, ఉపాధ్యాయులు, తుర్కలమద్దికుంట

ప్రభుత్వం చేపట్టిన బడిబాట కార్యక్రమం ద్వారా విద్యార్థులను చేర్పించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నాం. ఉపాధి హామీ పనులు, గ్రామ కూడళ్లలో పాఠశాలల గురించి వివరిస్తూ విద్యార్థులు చేరే విధంగా అవగాహన కల్పిస్తాం.

బడిబాట విజయవంతం చేస్తాం

సురేంద్రకుమార్, ఎంఈవో , పెద్దపల్లి



ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు అనుభవంతో కూడిన విద్యను అందిస్తున్నాం. విద్యార్థులకు ప్రతి అంశంపై క్షుణ్ణంగా అర్థమయ్యేలా వివరిస్తూ మంచి ఫలితాలు సాధించే దిశగా చర్యలు తీసుకుంటున్నాం. బడిబాట కార్యక్రమాన్ని మండలంలో విజయవంతం చేస్తాం.

మానసిక వేదనతో వృద్ధుడి బలవన్మరణం

గన్నేరువరం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యంలో ఒంటరిగా జీవించలేక మానసికవేదనకు గురైన ఓవృద్ధుడు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ తాండ్ర నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గునుకుల కొండాపూర్ గ్రామానికిచెందిన తాళ్లపల్లి పరశురాములు(80) వృద్ధాప్యంలో ఒంటరితనంతో జీవించలేక మానసికంగా విసిగిపోయి గురువారం ఉదయం తన ఇంట్లో దూలానికి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఐదేండ్ల క్రితం మృతిచెందగా వీరికి ఒక కుమారుడు, ముగ్గురు కూతుళ్లు. అందరికీ పెళ్లిళ్లు అయ్యాయి. కుమారుడు ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశానికి వెళ్లాడు. మృతుడి కోడలు అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి పంపించినట్లు ఎస్ఐ తెలిపారు.

మతిస్థిమితం సరిగా లేక తండ్రిని చంపిన తనయుడు

రాయికల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలం మైతాపూర్ గ్రామంలో మానసిక స్థితి సరిగా లేక తొట్లె ఎర్రయ్య (65) అనే వ్యక్తిని కన్న కొడుకు మల్లేష్ గొడ్డలితో గురువారం దాడిచేసి హతమార్చాడు. స్థానికులు తెలిపినవివరాల ప్రకారం.. ఎర్రయ్య కొడుకు మల్లేష్‌కు కొన్నేళ్లుగా మానసిక పరిస్థితి సరిగాలేదు. చిన్నప్పుడేతల్లి కూడా మరణించడంతో మల్లేష్ ఆలనాపాలనా ఎర్రయ్యనే చూసుకుంటున్నాడు. మానసిక స్థితి సరిగాలేక మల్లేష్ తరచూ తనతండ్రి ఎర్రయ్యతో గొడవ పడుతుండేవాడు. ఎర్రయ్య స్థానికంగా కూలిపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం ఉదయం ఇంటికి వచ్చిన ఎర్రయ్యతో మల్లేష్ గొడవపడి గొడ్డలితో దాడిచేయగా తలకు, కాళ్లకు తీవ్రగాయాలై మరణించాడు. కులపెద్దమనిషి నాగుల గంగమల్లయ్య ఫిర్యాదు మేరకు రాయికల్ ఎస్సై సుధీర్‌రావు కేసు నమోదు చేశాడు. జగిత్యాల రూరల్ సీఐ కృష్ణారెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

పెద్దపల్లి రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మండలంలోని కొత్తపల్లి గ్రామానికిచెందిన బూర్ల జనార్దన్(45) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. కుటుంబసభ్యులు ఎన్నిసార్లు చెప్పినా మానలేదు. బుధవారం సాయంత్రం జనార్దన్ అతిగామద్యం సేవించి ఇంటికి వచ్చాడు. భార్య ఉమతో మద్యం ఎందుకు తాగుతున్నావని మందలించింది. ఆమెపై చేయి చేసుకోవడంతో అదే గ్రామంలోని తల్లి దగ్గరికి వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గురువారం ఉదయం ఇంటికి వచ్చి ఎంత పిలిచినా తలుపు తీయకపోవడంతో కిటికీ నుంచి చూసేసరికి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య జయ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మణ్‌రావు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా పడి రైతు మృతి


ప్రవీణ్(ఫైల్)

మల్లాపూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మల్లాపూర్ మండలం రాఘవ పేట గ్రామంలో గురువారం ట్రాక్టర్ బోల్తా పడి చెదలు ప్రవీణ్(30) అనే రైతు మృతిచెందగా అతడి కుమారుడికి గాయాలయ్యాయి. ప్రవీణ్ ట్రాక్టర్‌తో తనభూమిని దున్ని పెద్ద కుమారుడు శ్రీహన్(10)ను కూర్చోబెట్టుకొని బయటకు వస్తుండగా ట్రాక్టర్ బోల్తాపడింది. ఆ సంఘటనలో కుమారుడు శ్రీహన్ పక్కకు పడిపోయాడు. ప్రవీణ్ ట్రాక్టర్ కిందే ఉండిపోయాడు. పొలం సమీపంలో గల రైతులు సహాయక చర్యలు చేపట్టగా ప్రవీణ్ అప్పటికే చనిపోయాడు. కుమారుడిని చికిత్స నిమిత్తం మెట్‌పల్లి ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య


నాగరాజు(ఫైల్)

మల్యాల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం నూకపల్లి డబుల్‌బెడ్ రూం ఇళ్లలో నివాసముండే క్షీరసాగరం నాగరాజు(39) అనేవ్యక్తి అప్పుల బాధతో బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై నరేశ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం నాగరాజుకు నాలుగు లక్షల రూపాయల అప్పు అయింది. బుధవారం ఉదయం ఇంట్లో నుంచి వెళ్లిన నాగరాజు సమీపంలోగల బైపాస్ దారి పక్క బావిలోదూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అప్పు ఇచ్చిన వారు తన కుటుంబసభ్యులను ఇబ్బంది పెట్టవద్దని మృతుడు ఓ చీటీ రాసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ప్రయాణికులకు తప్పని తిప్పలు

- మెట్‌పల్లి బస్టాండ్‌లో అసౌకర్యాలు
- సరిపడా ప్లాట్‌ఫాంలు లేక ఇబ్బందులు
- నిత్యం 50 వేల మంది రాకపోకలు
- వసతులు కల్పించాలంటున్న ప్రయాణికులు



మెట్‌పల్లి బస్టాండ్

మెట్‌పల్లిటౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమస్యలకు నిలయంగా మారింది. ప్రయాణికులకు సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి నిత్యం 50 వేల మంది ప్రయాణికులు ఇక్కడి నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. ప్రతి నెలా లక్షల్లో ఆదాయం వస్తున్నప్పటికీ ప్రయాణికులకు ఆర్టీసీ అధికారులు సరైన సౌకర్యాలు కల్పించడం లేదని పలువురు పేర్కొంటున్నారు. ప్రయాణికులు కూర్చోవడానికి సరైన ప్లాట్‌ఫాంలు లేవు. మెట్‌పల్లి బస్టాండ్ నుంచి నిజామాబాద్, వరంగల్, ఆదిలాబాద్, హైదారాబాద్, ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాలకు ఇక్కడి నుంచి నిత్యం 50 వేల మంది ప్రయాణికులు రాకపోకలు కొనసాగిస్తుంటారు.

డిపో పరిధిలో మొత్తం 50 బస్సులు ఉండగా వివిధ ప్రాంతాల నుంచి వందలో సంఖ్యలో బస్సులు మెట్‌పల్లి బస్టాండ్‌కు వస్తుంటాయి. ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులు, రైతులు పెద్ద సంఖ్యలో రాకపోకలు కొనసాగిస్తుంటారు.

అసౌకర్యం.. అపరిశుభ్రత

బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికులకు కూర్చునేందుకు వసతితో పాటు, మంచినీరు, సరిపడా మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. గతంలో నిర్మించిన మూత్రశాలలు నిరుపయోగంగా ఉన్నాయి. మహిళలకు సరిపడా మూత్రశాలలు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఉన్న మూత్రశాలలు పరిశుభ్రంగా లేవని ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. బస్టాండ్ ఆవరణలో చెత్తచెదారంతో పాటు మురికినీరు నిలుస్తోంది. ఇప్పుడే ఇలా ఉంటే వర్షాలు పడితే పరిస్థితి మరింత అధ్వానంగా మారే అవకాశం ఉంది. వేల సంఖ్యలో రాకపోకలు సాగించే బస్టాండ్‌లో కేవలం 5 ప్లాట్‌ఫాంలు మాత్రమే ఉండటంతో ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే పాఠశాలలు, కళాశాలలు ప్రారంభం అయితే రద్దీ మరింత పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్లాట్ ఫాంల సంఖ్యతో పాటు బస్టాండ్‌లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్లాట్‌ఫాంల సంఖ్య పెంచుతాం
దేవరాజ్, డిపో మేనేజర్, మెట్‌పల్లి

ప్రయాణికుల రద్దీతో బస్టాండ్‌లో సౌకర్యాలు, ప్లాట్ ఫాంల సంఖ్య పెంచేందుకు ప్రభుత్వానికి నివేదికలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే ప్లాట్ ఫాంల సంఖ్య పెంచుతాం. బస్టాండ్‌లో ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పిస్తాం.




నిరుపయోగంగా ఉన్న మూత్రశాలలు, అపరిశుభ్రంగా ఉన్న బస్టాండ్ ఆవరణ, ప్రయాణికులతో కిటకిటలాడుతున్న బస్టాండ్

మంత్రివర్గ విస్తరణలో
మాదిగలకు ప్రాతినిధ్యం కల్పించాలి

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ నేతృత్వంలో అధిష్టానాన్ని కలిసిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు


ఢిల్లీలో మల్లికార్జున ఖర్గేను కలిసి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ నేతృత్వంలోని ఎమ్మెల్యేలు

తిమ్మాపూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగబోయే తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు చోటు కల్పించాలని మాదిగ సామాజికవర్గానికి చెందిన ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ నేతృ త్వంలో ఎమ్మెల్యేలు మందుల సామెల్ (తుంగతుర్తి), అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ (ధర్మపురి), తోట లక్ష్మీకాంత రావు(జుక్కల్), కలె యాదయ్య(చేవెళ్ల) ఢిల్లీలో అఖిలభారత కాంగ్రెస్‌కమిటీ జాతీయఅధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సంస్థాగత వ్యవహారాల ప్రధానకార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను విడివిడిగా కలిసి వినతిపత్రాలు సమర్పించారు. రాష్ట్ర మంత్రివర్గంలో ప్రస్తుతం ఖాళీగాఉన్న ఆరుస్థానాల్లో భర్తీ చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కసరత్తు చేపట్టారని, ఈమంత్రివర్గ విస్తరణలో మాదిగలకు అవకాశం కల్పించాలని కోరారు. జనాభా నిష్పత్తి ప్రకారమే కాకుండా సామాజిక సమీకరణలను దృష్టిలో పెట్టుకొని మాదిగలకు అవకాశం కల్పించాలని కోరారు. 2011 జనాభా లెక్కల ప్రకారం మాదిగలు 33లక్షల మంది ఉన్నారని, తాజా లెక్కల ప్రకారం ఈ సంఖ్య రెట్టింపైన విషయాన్ని వారు గుర్తుచేశారు. ఈ లెక్కన మాదిగలకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలని కోరారు. మంత్రివర్గ విస్తరణలో తమకు న్యాయం జరుగుతుందని మాదిగలు ఆశలు పెట్టుకున్నారని, వారిఆశలు ఆకాంక్షలకు అనుగుణంగా మంత్రివర్గంలో మాదిగలకు అవకాశం కల్పించేలా చూడాలని వారు కోరారు. మాకు మంత్రి వర్గంలో స్థానం కల్పిస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి లాభం చేకూరుతుందన్నారు.

గోదావరిఖనిలో కారు బీభత్సం

- విద్యుత్ స్తంభాన్ని ఢీకొని పాఠశాల గోడపైకి ఎక్కిన కారు
- ఒకరికి తీవ్రగాయాలు

కోల్‌సిటీ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని పరశురాం నగర్‌లో గురువారం తెల్లవారుజామున కారు బీభత్సం సృష్టించింది. ప్రభుత్వ పాఠశాల వద్ద విద్యుత్ స్తంభానికి వేగంగా ఢీకొట్టడంతో స్తంభం విరిగింది. కారు వెనుక భాగం ప్రభుత్వ పాఠశాల గోడపైకి ఎక్కింది. ఘటనజరిగిన సమయంలో కారులో తిలక్‌నగర్ ప్రాంతా నికి చెందిన దార రోహిత్ అలియాస్ చింటు, అక్షయ్‌కుమార్ అనేఇద్దరు యువకులు ఉన్నారు. ఈఘటనలో దార రోహిత్‌కు గాయాలుకాగా లక్ష్మీనగర్‌లోని ఒకప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు. తిలక్‌నగర్‌కు చెందిన ప్రశాంత్ అనే ఫొటోగ్రాఫర్ వద్ద ఉన్న కారును బుధవారం అర్ధరాత్రి తరువాత ఇద్దరు యువకులు తీసుకుని వెళ్లారు. ఇతర స్నేహితులతో కలిసి మద్యంసేవించారు. తెల్లవారుజామున 4గంటలకు ఫైవింక్లయిన్ సెంటర్‌లో టిఫిన్‌చేసి కారులో పరశురాంనగర్‌వైపు వేగంగా వస్తుండగా అదుపుతప్పి స్తంభాన్ని ఢీకొట్టింది. భారీశబ్దంతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. విద్యుత్‌వైర్లు తెగిపడ్డాయి. ఘటన జరిగిన సమయంలో అక్షయ్ కుమార్ కారు నడుపుతున్నట్టు తెలుస్తోంది. సేఫ్టీ బెలూన్లు తెరుచుకోవడంతో ప్రాణాపాయం తప్పింది.

తెల్లవారే దాకా ఇదే తంతు...

తిలక్‌నగర్ ప్రాంతంలో దూళ్‌పేటగా చెప్పుకునే సిక్ హాస్పిటల్ ఏరియాకు చెందిన కొందరు యువకులు అర్ధరాత్రి నుంచి తెల్లవారు వరకు చిత్తుగా మద్యం సేవించి గొడవలకు దిగుతున్నారు. గతంలో తెల్లవారే వరకు మద్యం సేవించిన ముగ్గురు యువకులు ఉదయం 4గంటలకు ఫైవింక్లయిన్ ఏరియాలో టిఫిన్ చేసేందుకు వెళ్లి అక్కడికి వచ్చిన మరికొందరితో గొడవపడి హత్యాయత్నం చేశారు. ఆ కేసులో దార రోహిత్‌కూడా నిందితుడే. మళ్లీ అదేయువకుడు కారు బీభత్సంలో ఉన్నాడు. ఈఘటనపై గురువారం సాయంత్రం వరకుఎవరూ ఫిర్యాదు చేయలేదు. సింగరేణి ఎలక్ట్రికల్ అధికారులు ఫిర్యాదు చేయాల్సి ఉండగా వెనుకాడుతున్నట్టు తెలుస్తోంది.

విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

- కరీంనగర్ సీపీ గౌస్ ఆలం

చిగురుమామిడి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతోపాటు, క్రీడల్లో రాణించాలని కరీంనగర్ సీపీ గౌస్ ఆలం అన్నారు. ఈ నెల 12నుంచి 15వరకు డెహ్రాడూన్‌లో జరిగే జాతీయస్థాయి కరాటేపోటీలకు ఎంపికైన ఎ సాయిమిథన్‌రెడ్డిని గురువారం కరీంనగర్ సీపీ గౌస్ ఆలం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నవయస్సులో జాతీయస్థాయిలో పాల్గొనే అవకాశం రావడం సంతోషమన్నారు. కార్యక్రమంలో జపాన్ కరాటే అసోషియేషన్ ఇండియాన్ షాటోకాన్ కరాటే రాష్ట్ర అర్గనైజింగ్ కార్యదర్శి డాక్టరు బొల్లి ఐలయ్య, కోశాధికారి బండారిపల్లి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి పడి యువకుడికి తీవ్రగాయాలు

ఓదెల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొత్కపల్లి 29వ రైల్వే గేట్ వద్ద దానాపూర్ ఎక్స్‌ప్రెస్‌నుంచి పడి గోదావరిఖనికి చెందిన కంకనాల సంతోష్ అనే యువకుడు తీవ్రగాయాలపాలయ్యాడు. సికింద్రాబాద్ నుంచి రామగుండంకు దానాపూర్ ఎక్స్‌ప్రెస్‌లో వస్తుండగా డోర్ వద్ద ఉన్న సంతోష్ ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. తీవ్రగాయాలతో కొట్టుమిట్టాడుతున్న సంతోష్‌ను పొత్కపల్లి ఎస్ఐ దీకొండ రమేష్ సూచనల మేరకు బ్లూకోట్ సిబ్బంది శంకర్, శివశంకర్‌లు సంఘటన స్థలానికి చేరుకుని అంబులెన్స్‌లో సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మట్టిని తరలిస్తున్న టిప్పర్ల పట్టివేత

ఎల్లారెడ్డిపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న రెండు టిప్పర్లను ఎల్లారెడ్డిపేట మండలం రాగట్లపల్లి గ్రామ శివారులోని ఆర్ఐ శ్రవణ్ ఆధ్వర్యంలో సిబ్బంది గురువారం పట్టుకున్నారు. వాహనాలను తహసీల్ కార్యాలయానికి తరలించారు. వెంకటాపూర్ నుంచి అక్రమంగా మట్టిని రవాణా చేస్తున్నారనే సమాచారంతో కాపు కాచి పట్టుకున్నామని ఆర్ఐ శ్రవణ్ పేర్కొన్నారు.

బాలిక అదృశ్యం

జగిత్యాల క్రైం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మేడిపల్లి మండలం కాసారం గ్రామానికి చెందిన బాలిక(17) బుధవారం జిల్లా కేంద్రంలోని నిజామాబాద్ రహదారిలో అదృశ్యం అయ్యింది. బాలిక తన ఇంటి నుంచి బుధవారం జగిత్యాలకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబసభ్యులు పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. యువతితండ్రి రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

పెద్దపల్లి రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవునిపల్లికి చెందిన కుమ్మరి నర్సయ్య అనే రైతు గేదె విద్యుత్‌షాక్ గురై మృతి చెందింది. ఇంటి వద్ద గేదె కోసం ఏర్పాటు చేసిన షెడ్డు వద్ద ఉన్న మినీ ట్రాన్స్‌ఫార్మర్ సపోర్టు వైరుకు విద్యుత్ సరఫరా జరిగి గేదెకు తగిలి షాక్‌కు గురై మృతి చెందినట్లు తెలిపారు. గేదె మృతి చెందడంతో సుమారు 80 వేలరూపాయల వరకు నష్టపోయానని, ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

అట్రాసిటీ కేసుపై విచారణ

శంకరపట్నం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కరీంపేట గ్రామంలో ఎస్సీ సామాజికవర్గం వారిని అదేగ్రామానికి చెందిన ఓ కుటుంబ సభ్యులు కులం పేరుతో దూషించారని మేరుగుశ్రీనివాస్ ఇతరులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం హుజూరాబాద్ ఏసీపీ మాధవి విచారణ చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 22న రాత్రి 9గంటల సమయంలో గడ్డం మల్లవ్వ అతని కుమారుడు గడ్డం రాజు ఇంటి నుంచి కేకలు, అరుపులు వినపడగా సమీపంలో ఉన్న మేరుగు శ్రీనివాస్‌తోపాటు కొంతమంది అక్కడికి వెళ్లి చూశారు. గడ్డం మల్లవ్వ అతని కుమారుడు రాజు, తన భార్య రేణుక(స్వప్న)ను కొడుతుండగా ఎందుకు కొడుతున్నారని శ్రీనివాస్‌తోపాటు మెరుగు తిరుపతి, బొజ్జ బిక్షపతి, స్వామి, నాగమ్మ మరికొంత మంది అడిగారు. మా కోడలును మేము ఏమైనా చేసుకుంటామని, మీకెందుకు అని ఇష్టం వచ్చినట్లు కులంపేరుతో దూషించినట్లు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు ఏసీపీ మాధవి ఇరువర్గాలను విచారించి, సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేసుకున్నారు.

అదుపు తప్పి ధాన్యం లారీ బోల్తా

మంథనిరూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎక్లాస్‌పూర్ సమీపంలో గాడుదులగండి గుట్ట మూల మలుపు వద్ద వడ్ల ధాన్యం లారీ అదుపుతప్పి లోయలో పడింది. గురువారం ఉదయం భూపాలపల్లి జిల్లా నుంచి సుల్తానాబాద్‌కు ధాన్యాన్ని తీసుకెళ్తున్న లారీ అదుపు తప్పడంతో గుట్టపైనుంచి లోయ పడిందని స్థానికులు తెలిపారు. లారీ లోయలో పడటంతో వడ్ల బస్తాలు చిందరవందరగా పడిపోయాయి. ప్రమాదంలో లారీ డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

వృద్ధురాలిని తప్పించబోయి..

- బైక్‌పైకి దూసుకెళ్లిన లారీ
- దంపతుల దుర్మరణం
- గాయాలతో బయటపడిన చిన్నారి


చికిత్స పొందుతున్న మూడేళ్ల చిన్నారి సహస్ర

సుల్తానాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదం ఆ కుటుంబాన్ని చిన్నాభిన్నం చేసింది. లారీ రూపంలోవచ్చిన మృత్యువు తల్లిదండ్రులను బలి తీసుకోగా మూడేళ్ల చిన్నారి గాయాలతో బయట పడింది. వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్‌కు చెందిన గుంటిపల్లి రాములు (28) ఆయన భార్య అనూష (25)లు చిన్నారి సహస్ర(3)తో కలిసి సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్‌లో జరుగునున్న బంధువుల వివాహానికి హాజరుకావడానికి గురువారం రాత్రి బైక్‌పై బయలుదేరారు. సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధి సుగ్లాంపల్లి స్టేజీ వద్ద రాజీవ్‌రహదారిపై నడుచుకుంటూ వస్తున్న వృద్ధురాలిని తప్పించే యత్నంలో లారీ డివైడర్ దాటి ఎదురుగా వస్తున్న బైక్‌పై నుంచి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో అనూష అక్కడికక్కడే మృతిచెందగా ఆమెభర్త రాములుకు తీవ్ర గాయాల య్యా యి. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ శ్రావణ్ కుమార్‌లు ఘటనా స్థలానికి చేరుకొని గ్రామస్థుల సహాయంతో సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రు లను పోలీస్‌వాహనంలోనే సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే రాములు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. చిన్నారి సహస్ర స్వల్ప గాయాలతోచికిత్స పొందుతోంది. కాగా ప్రమాదం జరిగిన వెంటనేతాము 108అంబులెన్స్‌కు ఫోన్ చేశా మని, ఆలస్యంగావచ్చిందని గ్రామస్థులు ఆరోపించారు.

బసంత్‌నగర్‌లో విషాదం..

పాలకుర్తి (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని బసంత్‌నగర్ రాంనగర్‌లో నివాసముండె గుంటుపెల్లి రాములు, అనూషలు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది. మూడేళ్ల చిన్నారి సహస్రతో కలిసి ద్విచక్ర వాహనం పై వెళ్తుండగా సుగ్లాంపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి చెందారు. రాము 12 ఏళ్ల వయస్సులోనే తండ్రి కుమారస్వామి మృతి చెందాడు. తల్లి పద్మ పెంచి పెద్దచేసింది.. రాము లారీ డ్రైవర్‌గా జీవనం కొనసాగిస్తున్నాడు. కొడుకు అకాల మృతితో తల్లి పద్మ రోదనలు మిన్నంటాయి. అనూష స్వగ్రామం హుజూరాబాద్ మండలం అమ్మనగుర్తి.

ఎదురెదురుగా ఢీకొన్న రెండు లారీలు..

- ఒకరి మృతి.. మరో ఇద్దరికి తీవ్రగాయాలు


ఘటన స్థలం వద్ద సహాయక చర్యలు చేపడుతున్న పోలీసులు

హుజూరాబాద్‌రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మనపల్లి గ్రామశివారులోని కాకతీయ కాలువ బ్రిడ్జివద్ద రెండులారీలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఒకరు మృతిచెందగా ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం 7.30గంటల ప్రాంతంలో కరీంనగర్ వైపు నుంచి, అటు వరంగల్ వైపు నుంచి వస్తున్న రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ప్రకాశం జిల్లా టంగుటూరు గ్రామానికి చెందిన దాచేపల్లి కృష్ణకిషోర్(44) లారీక్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. అతికష్టం మీద క్షతగాత్రుడికి బయటకితీసి చికిత్స నిమిత్తం హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించే లోపే మృతిచెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కాగా లారీక్లీనర్ మస్తాన్, మరో డ్రైవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా రెండులారీలు బ్రిడ్జిపై ఢీకొని ఉండటంతో అటు వరంగల్, ఇటు కరీంనగర్‌కు వెళ్లే వాహనదారులు తీవ్రఇబ్బందులు పడాల్సివచ్చింది. పోలీసులు వాహనాలను దారి మళ్లించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఈ ఘట నపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నారు.

- ప్రమాద స్థలాన్ని పరిశీలించిన వొడితెల ప్రణవ్

ప్రమాదస్థలాన్ని నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి వొడితెలప్రణవ్ పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను సీఐ కరుణాకర్‌ను అడిగి తెలుసుకున్నారు. హైవేపై తరుచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు వెంటనే చర్యలు తీసుకోవాలని సీఐకి సూచించారు.

వివాహిత అదృశ్యం

- కేసు నమోదు

మెట్‌పల్లి రూరల్, జూన్, 5 (ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి మండలం వెల్లుల్ల గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యంపై గురువారం కేసు నమోదు చేసినట్లు మెట్‌పల్లి ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. వెల్లుల్ల గ్రామానికి చెందిన బోదాసు నళిని(21) అనే వివాహిత నిర్మల్ జిల్లా మామడ మండలం దిమ్మతుర్తి గ్రామానికి ఈనెల 4న ఉదయం వెళ్లింది. తిరిగి ఇంటికి వస్తున్నానని ఖానాపూర్ బస్సు ఎక్కినట్లు తెలిపింది. సాయంత్రం గడిచినా ఇంటికి తిరిగి రాలేకపోవడంతో ఆమె కోసం కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె అక్క బోదాసు మౌనిక ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పెళ్లి బృందం వాహనాన్ని ఢీకొట్టిన డీసీఎం వ్యాన్

- నాలుగు నెలల బాబు దుర్మరణం
- పెళ్లి కొడుకుతో పాటు ఆరుగురికి గాయాలు


రుద్ర (ఫైల్)

మల్యాల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలజిల్లా మల్యాల మండలం కొండగట్టు సమీపంలో గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో పెళ్లిబృందం ప్రయాణిస్తున్న కారును డీసీఎం వ్యాన్ ఢీకొట్ట డంతో నాలుగు నెలల బాబు వాగేరి రుద్ర మృతిచెందగా కారులోని పెళ్లి కొడుకు మహేశ్‌మెట్కర్‌తోపాటు మరో ఆరుగురికి గాయాలయ్యాయి. గురువారం ఉదయం జరిగే వివాహం కోసం మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి బయలుదేరిన పెళ్లి బృందం వాహనం మరో గంటన్నరలో పెళ్లి మండపానికి చేరుకునేలోపు ఎదురుగా వస్తున్న డీసీఎం వ్యాన్ ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. మల్యాల ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా చిక్కలవాడీకి చెందిన హరి మెట్కర్ పెద్ద కుమారుడు మహేశ్‌మెట్కర్‌కు కరీంనగర్ జిల్లా హుజూ రాబాద్‌కు చెందిన ఓ యువతితో గురువారం వివాహం నిశ్చయం అయింది. నాందేడ్‌నుంచి కారులో పెళ్లికొడుకు, కుటుంబసభ్యులు, మరోవాహనంలో బంధువులు బుధవారం రాత్రి హుజూరాబాద్‌కు బయలుదేరారు. గురువారం వేకువజాము నాలుగు గంటల సమయంలో కొండగట్టు సమీపానికి చేరుకోగానే ఎదురుగా ఖమ్మం నుంచి మామిడి కాయల లోడ్‌తో వస్తున్న డీసీఎం వ్యాన్ ఢీకొట్టింది. దీంతో కారు పూర్తిగా ధ్వంసం కాగాఅందులోని హరిమెట్కర్ మనవడు(కూతురి కుమారుడు) వాగేరి రుద్ర ముక్కులో నుంచి రక్తస్రావం అయి మృతిచెందాడు. ఈ ప్రమాదంలో పెళ్లి కొడుకుతోపాటు తండ్రి హరిమెట్కర్, కూతురు శీతల్, అల్లుడు దినేశ్, అన్న కూతుళ్లు లింగమ్మ, మరుబాయి, పొడే సోనాలి గాయపడగా చికిత్స కోసం జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన పెళ్లికొడుకు మహేశ్, అతని బావ దినేశ్‌ను మెరుగైన వైద్యంకోసం వారి స్వస్థలం నాందేడ్‌కు తీసుకెళ్లారు. హరిమెట్కర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు వ్యాన్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా ఈ ప్రమాదంలో పెళ్లి కొడుకు మహేశ్ గాయపడడంతో గురువారం జరగాల్సిన వివాహం నిలిచిపోయినట్లు వరుడి కుటుంబసభ్యులు తెలిపారు.

ఆగిపోయిన పెళ్లి

హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణంలోని ఇందిరానగర్‌లో ఓ యువతి పెళ్లి జరగాల్సి ఉండగా గురువారం నిలిచిపోయింది. నెలరోజుల క్రితం నాందేడ్‌కు చెందిన వరుడితో వివాహం నిశ్చయమైంది. వరుడు నాందేడ్ నుంచి కారులో వస్తుండగా, జగిత్యాల జిల్లా కొండగట్టు వద్ద డీసీఎం వ్యాన్ ఢీకొట్టింది. దీంతో వివాహం ఆగిపోయింది.

మున్సిపల్ కార్యాలయంలో మహిళ హల్‌చల్

- ఇంటి నిర్మాణ అనుమతి ఇవ్వడం లేదని ఆగ్రహం
- టీపీఎస్ ఫిర్యాదుతో కేసు నమోదు

కరీంనగర్ అర్బన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): తాను నిర్మించుకుంటున్న ఇంటికి మున్సిపల్‌కార్పొరేషన్‌లో దరఖాస్తు చేసినప్పటికీ అనుమతి ఇవ్వడం లేదంటూ కరీంనగర్ పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన గంగాభవానిఅనే మహిళ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం టీపీవో ఉద్యోగులతో గొడవకు దిగింది. ఉద్యోగులపై ఆగ్రహంవ్యక్తం చేస్తూ బీరువా, కంప్యూటర్లను ధ్వంసం చేసేందుకు ప్రయత్నించగా ఉద్యోగులు అడ్డుకున్నారు. గంగాభవాని ఇంటినిర్మాణం కోసం దరఖాస్తు చేసుకోగా, ఆమె అత్తామామలు అనుమతి ఇవ్వవద్దని మున్సిపల్ అధికారులకు ఫిర్యాదుచేశారు. దీనిపై టీపీవో అధికారులు విచారణ జరుపగా ఆస్థలం ప్రభుత్వ భూమిగా నిర్ధారణ అయింది. తహసీల్దార్ నుంచి క్లియరెన్స్ సర్టిఫికెట్ తీసుకురావాలని టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు గంగాభవానికి చెప్పారు. అయినప్పటికీ ఇంటి నిర్మాణపనులను గంగాభవాని ప్రారంభించడంతో టీపీవో అధికారులు నిర్మాణ సామగ్రిని స్వాధీనంచేసుకున్నారు. దీంతో ఆగ్రహించిన గంగాభవానీ ఉద్యోగులు లంచాలు తీసుకుని అనుమతి ఇవ్వకుండా తొక్కిపెడుతున్నారని దూషణకు దిగింది. ఆతర్వాత పోలీసులు సంఘటనస్థలానికి చేరుకుని ఆమెను అదుపులోకి తీసుకున్నారు. గంగాభవాని మున్సిపల్ కార్యాయలంలోని దౌర్జన్యంగా ప్రవేశించి తమవిధులకు ఆటంకం కలిగించి ప్రభుత్వఆస్తిని ధ్వంసం చేసి, ప్రభుత్వఅధికారిని దూషించి, చంపుతానని, ఇంటి అనుమతి ఇవ్వకుంటే చనిపోతానని బెదిరించినట్లు టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ దేవసాని సంధ్య కరీంనగర్ వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేసింది. ఈమేరకు గంగాభవానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వన్‌టౌన్ సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లతో ఆర్థికాభివృద్ధి

- రూ. 39 లక్షలు ఆర్జించిన 12 సంఘాలు
- ఆదర్శంగా నిలుస్తున్న చొప్పదండి గ్రామైక్య సంఘాలు


ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం (ఫైల్)

వారంతా గ్రామాల్లో కూలి పనులు చేసుకుంటూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉండే సామాన్య మహిళలు. కుటుంబమే లోకమని అనుకునే వారంతా సంఘంగా ఏర్పడ్డారు. మార్కెటింగ్ ఎలా చేయాలో తెలియదు. ప్రభుత్వ ప్రోత్సాహంతో కొనుగోళ్లపై అవగాహన పెంచుకున్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లు చేపట్టి రాణిస్తున్నారు. చొప్పదండి మండలంలో రబీలో 12 కేంద్రాల్లో లక్షకుపైగా క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేసిన గ్రామైక్య సంఘాలు జిల్లాలోనే ఆదర్శంగా నిలుస్తున్నాయి. దాదాపు 35 లక్షల రూపాయలను కమీషన్ రూపంలో మహిళా సంఘాలు ఆర్జించారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘ మహిళల విజయగాథపై కథనం...

చొప్పదండి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో గత ఏప్రిల్‌లో 12 గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. భూపాలపట్నం, చిట్యాలపల్లి, దేశాయిపేట, గుమ్లాపూర్, కాట్నపల్లి, కొలిమికుంట, కోనేరుపల్లి, మంగళపల్లి, పెద్దకుర్మపల్లి, రేవెల్లి, సాంబయ్యపల్లి, వెదురుగట్టలో కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేశారు. గ్రామైక్య సంఘాలు, స్వయం సహాయక సంఘాల మహిళలు పగలు, రాత్రి కష్టపడి కేంద్రాలను నిర్వహించారు. రైతుల నుంచి లక్షకుపైగా క్వింటాళ్ల ధాన్యాన్ని సేకరించి సకాలంలో రైస్ మిల్లులకు తరలించారు. ఐకేపీ సిబ్బంది సంఘాలకు పూర్తి స్థాయిలో సహకారం అందించగా, సంఘాలు మరి కొంత మందికి ఉపాధి కల్పించారు.

1,21,895 క్వింటాళ్ల ధాన్యం సేకరణ

రబీ సీజన్‌లో 12 కొనుగోలు కేంద్రాల ద్వారా 1,21,895 క్వింటాళ్ల ధాన్యం రైతుల నుంచి సేకరించారు. గత ఖరీఫ్ కన్నా ఈ సారి అధికంగా కొనుగోలు చేశారు. పెద్ద కుర్మపల్లి కొనుగోలు కేంద్రంలో అత్యధికంగా 28,524 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు. గుమ్లాపూర్‌లో 10,040 క్వింటాళ్లు, వెదురుగట్టలో 11,158 క్వింటాళ్ల ధాన్యాన్ని మహిళా సంఘాలు సేకరించారు. మహిళలు సేకరించిన ధాన్యానికి క్వింటాలుకు రూ. 32 చొప్పున రాష్ట్ర ప్రభుత్వం కమీషన్ అందజేస్తుండగా, మండలంలో 12 సంఘాలు 39 లక్షల 640 రూపాయలను కమీషన్ రూపంలో ఆర్జించారు. పెద్దకుర్మపల్లి గ్రామైక్య సంఘం 9 లక్షల 12 వేల 768 రూపాయలను ఆర్జించింది.



సమర్థవంతంగా పనిచేశారు
నర్మద, ఐకేపీ ఏపీఎం, చొప్పదండి

ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో మహిళా సంఘాలు సమర్థవంతంగా పనిచేశారు. మండల సంఘాలు జిల్లావ్యాప్తంగా మంచి పేరు సాధించాయి. ధాన్యం సేకరణతో సంఘాలు లక్షలాది రూపాయల ఆదాయాన్ని సమ కూర్చుకుంటున్నా యి. పురుషులకు దీటుగా ధాన్యం కొనుగోళ్లలో మహిళలు రాణిస్తూ మన్ననలను పొందుతున్నారు.



అందరి సహకారంతో సాఫీగా కొనుగోళ్లు
ఉమ, గ్రామైక్య సంఘం కమిటీ మెంబర్, రేవెల్లి

అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, వ్యాపారులు అందరి సహకారంతో కొనుగోళ్లను సాఫీగా పూర్తి చేశాం. కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని తూకం వేసి మిల్లులకు పంపించి, రైతులకు నగదు వచ్చే వరకు అప్రమత్తంగా ఉన్నాం. రైతులకు ఎలాంటి నష్టం, జాప్యం జరగకుండా పనిచేశాం. సంఘానికి ఆదాయంతో పాటు మంచి పేరు వచ్చింది.



చామనపల్లికి ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డు


అవార్డు అందుకుంటున్న చామనపల్లి గ్రామకార్యదర్శి కోరుకంటి మహేందర్ రావు

కరీంనగర్ రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలంలోని చామనపల్లి గ్రామ పంచాయతీకి రాష్ట్ర ఉత్తమ పంచాయతీ అవార్డు లభించింది. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో దేవాదాయ, పర్యావరణ, అటవీశాఖ మంత్రి కొండాసురేఖ చేతుల మీదుగా పంచాయతీకార్యదర్శి కోరుకంటి మహేందర్‌రావు అవార్డును, ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. ఈ అవార్డుకు రాష్ట్రంలో 3గ్రామపంచాయతీలు ఎంపికవగా చామనపల్లి మొదటి స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి జగన్మోహన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కె మహేందర్‌రావును, సిబ్బందిని మంత్రి అభినందించారు. చామనపల్లిలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, స్వచ్ఛదనం, పచ్చదనం సక్రమ నిర్వహణ, సెగ్రిగేషన్, కంపోస్టు ప్రిపరేషన్, విటమిన్ గార్డెన్, ప్లాస్టిక్ వ్యర్థల సక్రమ నిర్వహణ, ప్లాంటేషన్, నర్సరీ, కమ్యూనిటీ సోక్ పిట్స్ వంటిఅంశాల్లో చామనపల్లి అత్యుత్తమ తీరు కనబరిచింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్‌సెక్రెటరీ అహ్మద్ నదీమ్, టీఎస్‌పీసీబీ మెంబర్, సెక్రెటరీ రవి, చామనపల్లి తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుడికి చిక్కిన 14కిలోల చేప

గంబీరావుపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): గంబీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టులో 14కిలోల చేప చిక్కింది. గంబీరావుపేటకు చెందిన నర్సింలు అనే మత్స్యకారుడు గురువారం రోజులాగే మానేరులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. నర్సింలు వలకు 14 కిలోల చేప చిక్కింది. మండల కేంద్రంలోని చేపల మార్కెట్‌కు నర్సింలు చేపను తీసుకరాగా అందరూ ఆసక్తిగా తిలకించారు.


14 కిలోల చేపతో మత్స్యకారుడు నర్సింలు

ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ డ్రైవ్

తిమ్మాపూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొరండ్లలో జిల్లాఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ, లోహియా ఎడిబిలయిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యానవన అధికారి ఆర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ వరిపంటకు ప్రత్యామ్నాయంగా మార్కెట్లో డిమాండ్ ఉన్న ఆయిల్‌పామ్ పంట వేసుకోవాలని సూచించారు. ఒక టన్ను పామ్ ఆయిల్ గెలల ధర 20,058 రూపాయలు ఉందని, ఒక ఎకరానికి 10 టన్నులదిగుబడి వస్తుందని, దీంతో సంవత్సరానికి లక్షకు పైగా ఆదాయం పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఆయిల్‌పామ్ రైతు చాటీ రాజేశ్వర్‌రావు, బొమ్మిడి విజయ్‌కుమార్, ఉద్యానవనాధికారి రవళి, లోహియా ఎడిబిల్ అయిల్స్ మేనేజర్ విజయభరత్, ఏఈఓ పూర్ణ చందర్, ఫీల్డ్‌ఆఫీసర్ రాజ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.


పొరండ్లలో ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్ డ్రైవ్‌లో పాల్గొన్న అధికారులు, రైతులు

మిస్సింగ్ కేసును ఛేదించిన పోలీసులు

ముస్తాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : మిస్సింగ్ కేసును పోలీసులు 24గంటల్లో ఛేదించారు. మండలంలోని గూడరుకు చెందిన జంపెల్లి మల్లయ్య(72) కనబడటం లేదని జంపెల్లి మల్లవ్వ ఫిర్యాదుచేసింది. కేసు నమోదు చేసుకొని ఎస్సై గణేశ్ దర్యాప్తును ప్రారంభించారు. సెల్‌ఫోన్‌ల సిగ్నల్ ఆధారంగా 24 గంటల్లో మిస్సింగ్ అయిన వ్యక్తిని కనుగొన్నారు. మల్లయ్యను విచారించగా ఈనెల 2వ తేదీన రాత్రి తన కుమారుడు పర్శరాములు డబ్బులు ఇవ్వడం లేదని కక్ష పెంచుకున్న బోయిన రాజేందర్,అతని స్నేహితుడు కలకోట రవి, నందినికారి సతీశ్ అనేకారు డ్రైవర్‌లు కిడ్నాప్‌చేసి కోరుట్లలోని ఒకరూంలో బంధించారని తెలిపారు. విచారణజరిపి బోయిన రాజేందర్, కలకోట రవి, సతీశ్‌లపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.



ముస్తాబాద్‌లో అరెస్టును చూపుతున్న పోలీసులు

పర్యావరణ పరిరక్షణ కోసం పాటుపడదాం


జ్యూట్ బ్యాగులను ప్రదర్శిస్తున్న సభ్యులు

కరీంనగర్ కల్చరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణ కోసం అందరం పాటుపడుదామని, గాలి, నీరు, నేల ప్లాస్టిక్ సంచులతో కలుషితం కాకుండా క్లాత్ లేదా జనపనార సంచులను వాడుదామని మానేరు పర్యావరణ పరిరక్షణసమితి అధ్యక్షుడు తోట లక్ష్మణరావు అన్నారు. ప్రపంచపర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం వైశ్య భవన్‌లో గన్నీ బ్యాగులను ప్రదర్శించారు. పర్యావరణ దినోత్సవ బ్యానర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పలుచని ప్లాస్టిక్ సంచులు పీడనం, ఉష్ణోగ్రతల వద్ద చిరిగిపోయి సూక్ష్మ కణాలుగా గాలిలో వెదజల్లబడి భూతాపాన్ని పెంచుతాయన్నారు. కలుషితమైన ఆ గాలిని పీల్చడంతో శ్వాస కోశ, నాడీ మండల వ్యాధులు వస్తాయన్నారు. ప్లాస్టిక్ కణాలు గాలి నుంచి భూమిని చేరి పొలాల్లోని జీవసారాన్ని నశింపజేస్తాయని, పంట దిగుబడులను తగ్గిస్తాయని అన్నారు. కలుషిత నీటిని తాగి సున్నితమైన జీవజాతులు అంతరించి పోతాయన్నారు. సంస్థ సహాధ్యక్షుడు పెద్ది లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అతిథులకు శుభ కార్యాల్లో గన్నీ బ్యాగులు బహుమతిగా ఇవ్వాలన్నారు. వైశ్యసేవా కేంద్రం అధ్యక్షుడు చిదురసురేశ్ పర్యావరణ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కన్న కృష్ణ, సామ నారాయణ, పెద్ది రామన్న, కొమురవెల్లి వేంకటేశం, నలుమాచు సుదర్శనం, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ ఫైనల్స్‌కు ఉమ్మడి జిల్లా జట్టు


ఫైనల్స్‌కు చేరిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాలుర హ్యాండ్‌బాల్ జట్టు

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాలుర జట్టు ఫైనల్స్‌లోకి ప్రవేశించింది. నల్గొండజిల్లా నకిరేకల్ మండలం మంగళంపల్లిలో కొనసాగుతున్న ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు పలు జట్లపై విజయం సాధించింది సెమీ ఫైనల్‌కు చేరింది. గురువారం సాయంత్రం నిర్వహించిన సెమీ ఫైనల్స్‌లో నల్గొండపై విజయం సాధించి ఫైనల్స్‌కు చేరిందని జిల్లా జట్టు కోచ్ మూల వెంకటేశ్ తెలిపారు. ఈ సందర్భంగా జట్టును ఉమ్మడి కరీంనగర్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బాసరవేణి లక్ష్మణ్, సంయుక్త కార్యదర్శి ఎన్ ప్రభాకర్ తదితరులు అభినందించారు.

గోశాలలో అనారోగ్యంతో ఉన్న రెండు కోడెల మృత్యువాత

- జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్‌రెడ్డి

సిరిసిల్ల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజన్న ఆలయ తిప్పాపూర్‌లోని గోశాలలో అనారోగ్యంతో ఉన్న రెండు కోడెలు మృత్యువాత పడ్డాయని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గోశాలలో అనారోగ్యంతో ఉన్న కోడెలకు వెటర్నరీ వైద్యులు చికిత్సలకు అందిస్తున్నారని, కొత్తగా కోడెలు అనారోగ్యానికి గురికాలేదని తెలిపారు. గోశాలలో ఉన్న 1300 కోడెలలో ప్రస్తుతం 12 మాత్రమే అనారోగ్యంతో బాధపడుతున్నాయని తెలిపారు.



ఆర్వోబీ వద్ద కొనసాగుతున్న పనులు, పాత గేటు పక్కనే ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్డు

చురుగ్గా ఆర్వోబీ పనులు

- కొత్తగా డైవర్షన్ రోడ్డు ఏర్పాటు
- కేంద్ర మంత్రి బండి ఆదేశాలతో పనుల్లో కదలిక

కరీంనగర్ రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ తీగలగుట్టపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనుల్లో ఎట్టకేలకు పురోగతి కనిపిస్తోంది. కరీంనగర్-తీగలగుట్టపల్లి రహదారిలో రైళ్ల రాకపోకలతో వాహనదారులు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా రైల్వే శాఖ మూడేళ్ల క్రితం ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టింది. దాదాపు రూ.150 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభించిన పనులు ఏడాదిలోగా పూర్తవుతాయని అధికారులు ప్రకటించారు. మొదట్లో కొంత వేగంగా పనులు చేపట్టిన కాంట్రాక్టర్ కొద్ది రోజుల తర్వాత పూర్తిగా నిలిపివేశారు. దీంతో రహదారి గుండా వెళ్లే వాహనదారులు నిత్యం అవస్థలు పడ్డారు. అర కిలోమీటర్ వరకు చేపట్టిన రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులతో ఆ ప్రాంతం అంతా గుంతలమయంగా మారింది. వాహన దారులతోపాటు పాదచారులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రైల్వే అధికారులకు, ప్రజా ప్రతినిధులకు పలు మార్లు ఫిర్యాదులు చేశారు. దీంతో స్థానిక ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఆరు మాసాలుగా రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణంతోపాటు అమృత్ భారత్ నిధులతో రైల్వే స్టేషన్ పనులపై దృష్టి సారించారు. పలు మార్లు సంబంధిత కాంట్రాక్టర్‌లతో పాటు దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులకు పనులపై ఫిర్యాదు చేశారు. దీంతో దక్షిణ మధ్య రైల్వే అధికారులు స్టేషన్‌తో పాటు ఆర్వోబీ నిర్మాణ పనులను పరిశీలించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు.


గేటు పడడంతో ఆగిన వాహనాలు

రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులను కొత్త కాంట్రాక్టర్‌కు అప్పగిస్తూ త్వరలోనే పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ఇందులో భాగంగా పనుల్లో వేగం పెంచారు. పాత రైల్వే గేటు పైనుంచి ఓవర్ బ్రిడ్జి పనులు సాగనున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా డైవర్షన్ రోడ్డుతోపాటు రైల్వే గేటును ఏర్పాటు చేశారు. ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు చురుగ్గా సాగేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నారు. ఎట్టకేలకు రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు చురుగ్గా చేపడుతుండడంపై వాహనదారులు, ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పనులు మధ్యలో నిలిపి వేయకుండా పూర్తి చేయాలని కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ ఢీకొని యువకుడి మృతి


రవికుమార్(ఫైల్)

మెట్‌పల్లి రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి మండలం వెల్లుల్ల గ్రామ శివారులో గురువారం రాత్రి ద్విచక్ర వాహనాన్ని ఇసుక ట్రాక్టర్ ఢీ కొనడంతో బండలింగాపూర్‌కు చెందిన గుగ్గిళ్ల రవి కుమార్(18) అనే యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం బండలింగాపూర్ గ్రామానికి చెందిన గుగ్గిళ్ల రవికుమార్ ఆరోగ్య పరీక్షల నిమిత్తం మెట్‌పల్లి ఆసుపత్రికి వచ్చాడు. రాత్రి తిరిగి బండలింగాపూర్‌కు వెళ్తుండగా వెల్లుల్ల గ్రామ శివారులో ఎదురుగా ఇసుక లోడుతో వస్తున్న ట్రాక్టర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో రవికుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా రవికుమార్ మృతి చెందినట్లు తండ్రి గుగ్గిళ్ల రాజు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


తిప్పాపూర్ గోశాలను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రాజన్న కోడెల మృతి కలిచివేసింది

- విశాలమైన ప్రదేశంలో గోశాల నిర్మాణం చేపడతాం
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి గోశాలకు చెందిన కోడెల మృతి తనని ఎంతగానో కలిచివేసిందని ప్రభుత్వ విప్, వేములవాడ శాసన సభ్యుడు ఆది శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. రాజన్న ఆలయ తిప్పాపూర్ గోశాలను ఈవో వినోద్‌రెడ్డి, వైద్యబృందంతో కలిసి పరిశీలించి కోడెల ఆరోగ్య వివరాలు వైద్య అధికారులను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటీవల కొన్ని కోడెలు అనారోగ్యంతో మరణించడం చాలా బాధాకరమని, ప్రభుత్వం తరుపున సీఎం రేవంత్‌రెడ్డి కోడెల మరణాల విషయంలో వాకబ్ చేసి రాష్ట్ర స్థాయి అధికారులను పంపించారని తెలిపారు. పశుసంవర్ధక శాఖ అధికారులు, జిల్లా కలెక్టర్, ఆలయ ఈవో, సిబ్బందితో పాటు అన్నివిభాగాల అధికారులు కోడెలను నిత్యం పర్యవేక్షణ చేస్తున్నారని తెలిపారు. సీజనల్ వ్యాధులు, అనారోగ్యంతోపాటు కొన్ని కోడెలకు లంపిస్కిన్ వ్యాధివచ్చినట్లు వైద్యాధికారులు తెలిపారన్నారు. 16మంది వైద్యసిబ్బంది కోడెలను పర్యవేక్షిస్తున్నారని అన్నారు. దాదాపు 18నుంచి 20కోడెలు అనారోగ్యం నుంచి కోలుకుని ఆర్యోగంగా ఉన్నట్లు తెలిపారు. వేములవాడలో విశాలమైన గోశాలను నిర్మాణం చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి సంకల్పంచారని అన్నారు. కోడెమొక్కు భక్తుల విశ్వాసానికి నమ్మకానికి ప్రతీక అని రాజన్న ఆలయ కోడెలపై రాజకీయం చేయడం మానుకోవాలని సూచించారు. మొదటి దశలో సుమారుగా ఒక వెయ్యి కోడెలను రైతులకు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. భక్తులు సమర్పించే కోడెలలో కొన్నింటికి లంపీ స్కిన్ వ్యాధి ఉండటంతో ఇతర కోడెలకువ్యాపించినట్లు అధికారులు తెలిపారని వివరించారు.భక్తులు సమర్పించే కోడెలను పదిరోజులపాటు క్వారంటైన్‌లో పెట్టి తరవాత మిగతా వాటితో కలిపే విధంగా చూడాలని ఆదేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈవో వినోద్‌రెడ్డి, పశువైద్యాధికారులు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

గోశాలను సందర్శించిన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

తిప్పాపూర్ గోశాలలోని కోడెలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని వాటికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా ఆదేశించారు.

తిప్పాపూర్‌లోని గోశాలను గురువారం ఉదయం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గోశాల ఆవరణలో పారిశుధ్య పనుల కోసం అదనంగా వర్కర్లను నియమించేందుకు ఉద్యోగ ప్రకటన జారీ చేశామని, కోడెల సంరక్షణకు పకడ్బందీగా అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కోడెలకు అందిస్తున్న వైద్య చికిత్స వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. గోశాలలో నిర్వహణ స్వయంగా పరిశీలించారు. కోడెలకు మెరుగైన దాణా, పచ్చిగడ్డి, తాగు నీరు అందించాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఈవో వినోద్‌రెడ్డి, పశువైద్యబృందం, విశ్వహిందూ పరిషత్ సభ్యులు రాధా కిషన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం

రామ్‌మోహన్‌చారి, ఎంపీడీవో



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: పైలట్ గ్రామంగా ఎంపికైన రామరావుపల్లెలో ఎన్ని ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి?

ఎంపీడీవో: రామరావుపల్లె గ్రామంలో 121 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి.

ఆంధ్రజ్యోతి: ఇప్పటి వరకు ఎన్ని ఇళ్ల నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయి

ఎంపీడీవో: 31 ఇళ్ల నిర్మాణం పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. 11 ఇళ్ల నిర్మాణ పనులు బేస్‌మెంట్ వరకు వచ్చాయి. అందులో 5గురు లబ్ధిదారుల ఖాతాల్లో లక్ష చొప్పున ప్రభుత్వం జమ చేసింది.

ఆంధ్రజ్యోతి: లబ్ధిదారులకు ఏ పద్ధతిలో డబ్బులు అందిస్తారు.

ఎంపీడీవో: 400 చదరపు అడుగులకు తగ్గకుండా 600లకు మించకుండా ఇళ్ల నిర్మాణం చేసుకోవాలి. హాల్, పడక గది, వంట గది, మరుగుదొడ్డి ఉండాలి. బేస్‌మెంట్ లెవల్ వరకు లక్ష, రూఫ్‌లెవల్ 1 లక్ష 25వేలు, అనంతరం 1 లక్ష 75 వేలు, మరుగుదొడ్డి నిర్మాణంతోసహా ఇళ్లు పూర్తయిన తరువాత లక్ష రూపాయలు లబ్ధిదారుని ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తుంది. ఐదు లక్షల రూపాయలు అందజేస్తుంది.

- పాలకుర్తి

రేషన్‌డీలర్‌పై చర్య తీసుకోవాలి

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కాలనీలోని పోస్టాఫీస్ ఏరియా రేషన్ డీలర్‌పై చర్యలు తీసుకోవాలని మాజీ కార్పొరేటర్ శంకర్‌నాయక్ డిమాండ్ చేశారు. గురువారం లబ్ధిదారులతో కలిసి రేషన్ దుకాణం వద్ద నిరసన వ్యక్తం చేశారు. లబ్ధిదారులకు ప్రభుత్వం ఇస్తున్న సన్న బియ్యాన్ని సక్రమంగా ఇవ్వడం లేదని, కోటా తగ్గించి ఇవ్వడం, దుకాణాన్ని తెరవడం లేదని తెలిపారు. రేషన్ బియ్యాన్ని డీలర్ పక్కదారి పట్టిస్తున్నట్లు ఆరోపించారు. అధికారులు దర్యాప్తు చేసి అక్రమాలకు పాల్పడకుండా రేషన్ డీలర్‌పై చర్యలు తీసుకోవాలని శంకర్‌నాయక్ డిమాండ్ చేశారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి



ఖనిలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్పొరేషన్, పరిశ్రమల అధికారులు, సుల్తానాబాద్ బస్టాండ్‌లో మొక్క నాటుతున్న కమిషనర్, ఆర్టీసీ ఎస్ఎం

కోల్‌సిటీ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో పరిశ్రమలతోపాటు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని, విరివిగా మొక్కలు నాటాలని రామగుండం కమిషనర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం నిర్వహించిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ పర్యావరణానికి హాని చేసే ప్లాస్టిక్ వాడకూడదని, మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత అందరిపై ఉందన్నారు. మొక్కలను పెంచడం వల్ల కొంత కాలుష్యాన్ని నివారించవచ్చుని, పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్లాస్టిక్‌కు బదులు బట్ట సంచులు, బుట్టలు వాడాలని ఆమె అన్నారు. గోదావరిఖని ప్రధాన చౌరస్తా నుంచి ప్రారంభమైన ర్యాలీ మల్లికార్జున్‌నగర్, సీతానగర్, రాంమందిర్‌గుండా కోదండ రామాలయంకు చేరుకుంది. కాలుష్య నియంత్రణ మండలి డీఈ బిక్షపతి, నగరపాలక డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి, ఆర్ఎఫ్‌సీఎల్ అధికారి శుక్ల, సింగరేణి అధికారి డేనియల్ కుమార్, ఎన్‌టీపీసీ అధికారి కేవీరావు, అల్ట్రాటెక్ సిమెంట్ అధికారి జీఎంఎస్ రెడ్డి, వీరేశ్, కనకజ్యోతి, కుమారస్వామి, శంకర్‌రావు, రజిని పాల్గొన్నారు.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిరక్షించడం అందరి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ నియాజ్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బస్టాండ్‌లో స్టేషన్ మాస్టర్ మల్లేశంతో కలసి మొక్కలు నాటారు. మెప్మా పరిధిలోని మహిళా సంఘాల సభ్యులతోపాటు మున్సిపల్ ఉద్యోగులు సిబ్బంది మొక్కలు నాటారు. ప్రధాన రోడ్ల గుండా మహిళా సంఘాల వారిచే ర్యాలీ నిర్వ హించి ప్రజలకు అవగాహన కల్పిం చారు. చెరువు కట్ట వద్ద మొక్కలు నాటారు. మున్సిపల్ మేనేజర్ అలీ మొద్దీన్, ఆర్పీసీ గైడ్ రమేష్ పాల్గొ న్నారు. మాజీ కౌన్సిలర్ గొట్టం లక్ష్మీ, మహేష్, స్వప్న మొక్కలు నాటారు. మండల పరిషత్ కార్యాలయంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎంపీ డీఓ దివ్యదర్శన్ రావు ప్రారంభిం చారు. ఈజీఎస్ ఏపీఓ మల్లీశ్వరి, రాజ్‌కుమార్, కుమార్, సాదిక్ పాషా పాల్గొన్నారు.

అలాగే మానవాళి మనుగడకు విరివిగా మొక్కలు నాటాలని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి దుర్గం గణేష్ అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కోర్టులో మొక్కలు నాటారు. సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నేరేళ్ల శంకరయ్య, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి భూమయ్య, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, లోక్ అదాలత్ మెంబర్స్ మాదూరి అంజనేయులు, ఏజీపీ దూడం అంజనేయులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

పాలకుర్తి, (ఆంధ్రజ్యోతి): జీడీనగర్‌లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఎంపీడీవో కలికోట రామ్‌మోహన్‌చారి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిర క్షణకు మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. ఎంపీవో ఉప్పు సుదర్శన్,కార్యదర్శి సంజీవ్,టీఏ మహేష్ పాల్గొన్నారు.

మంథని, (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కోర్టు ఆవరణలో సీనియర్ సివిల్ జడ్జి భవాని, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మున్సిపల్ కమిషనర్ మనోహర్, తహసీల్దార్ కుమారస్వామి, ఎస్ఐ రమేష్‌లు మొక్కలు నాటారు. మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో తమ్మిచెరువులో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఎల్ఎన్ హరిబాబు, ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి రఘోత్తంరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.సహేందర్‌రెడ్డి, అంజనేయులు, న్యాయవాదులు శ్రీనివాస్, శశిభూషన్‌కాచే, అంజి యాదవ్, కోర్టు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రామగిరి, (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్‌రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఎంపీడీవో శైలాజారాణి సూచించారు. కార్యాలయంలో మండల పంచాయతీ సెక్రెటరీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో సూచనలు చేశారు. ప్లాస్టిక్ పర్యావరణానికి పెద్దముప్పుగా ఉంటుందనే విష యాన్ని ప్రజలకు తెలియాజేయాలని పేర్కొన్నారు. డ్రైనేజీలు, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించా లని సూచించారు. అనంతరం పన్నూరు పంచాయతీలో మొక్కలను నాటారు. ఎంపీవో ఉమేష్, టీఏ అఖిల, సీవో సత్యం, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

కాలుష్యం నియంత్రణకు ఎన్టీపీసీ కృషి

జ్యోతినగర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ సమాజంలోని ప్రతి పౌరుడి కనీస బాధ్యతని ఎన్టీపీసీ ఈడీ చందన్ కుమార్ సామంత అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఈఎంజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలన్నారు. ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని తగ్గించాలని సూచించారు. కాలుష్య నియంత్రణకు ఎన్టీపీసీ యాజమాన్యం పటిష్ఠమైన చర్యలు తీసుకుంటున్నదన్నారు. ప్రాజెక్టు ఎన్విరాన్‌మెంటల్ మేనేజ్‌మెంట్ గ్రూప్(ఈఎంజీ) ఆధ్వర్యంలో గ్రీన్ వాక్ నిర్వహించారు. టౌన్‌షిప్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద ప్రారంభమైన ర్యాలీ ప్రధాన గేటు వరకు కొనసాగింది. టౌన్‌షిప్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఈడీ ప్రాజెక్టు అధికారులు, ఉద్యోగులతో పర్యావరణ ప్రతిజ్ఞ చేయించారు. ఎన్టీపీసీ డైరెక్టర్ సందేశాన్ని జీఎం సింగరాయ చదివి వినిపించారు. ప్లాస్టిక్ నియంత్రణలో భాగంగా ఉద్యోగులకు జ్యూట్ బ్యాగులను పంపిణీ చేశారు. జీఎంలు, దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు రాఖీ సామంత, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



మంథనిలో మొక్క నాటుతున్న జడ్జి భవాని, ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లో గ్రీన్‌వాక్‌లో పాల్గొన్న ఈడీ చందన్ కుమార్, ఉద్యోగులు

ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు నమ్మకం కలిగించాలి



బడిబాట కార్యక్రమంపై చర్చిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లి కల్చరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో అందే నాణ్యమైన విద్యపై తల్లిదండ్రులకు నమ్మకం కలిగించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో బడిబాటపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ బడిబాట ద్వారా ఈనెల 6నుంచి జూన్ 19వరకు విద్యాసంస్థల్లో పిల్లలను చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో బడిబాట కార్యక్రమం నిర్వహించాలన్నారు. గత సంవత్సరం బడిబాట కార్యక్రమం ద్వారా 2099 మంది విద్యార్థులు చేరారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మొదటి రోజే పాఠ్య పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్స్ పంపిణీ చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేశామని తెలిపారు. 3నుంచి 14 సంవత్సరాలు వయస్సు ఉన్నవారు తప్పనిసరిగా అడ్మిషన్ తీసుకోవాలన్నారు. 15సంవత్సరాల వయస్సు ఉన్నవారిచే ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు రాసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీలను భర్తీచేసిందని, అమ్మఆదర్శ పాఠశాల ద్వారా అవసరమైన మౌలిక వస్తువులు కల్పించామన్నారు. ఈనెల 12న జరిగే సమావేశంలో అమ్మఆదర్శ కమిటీ సభ్యులు, పిల్లల తల్లిదండ్రులు హాజరయ్యేలా చూడాలని అన్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి, జెడ్పీసీఓ నరేందర్, జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య, జీసీడీవో కవిత, పాల్గొన్నారు.

యజమాని సమాధి వద్దే శునకం



సుల్తానాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామునిపల్లి గ్రామానికి చెందిన తాళ్లపల్లి కొమురయ్య (85) ఐదు రోజుల క్రితం కారు ఢీకొని మృతి చెందాడు. కొమురయ్య కనుకులలో ఉండే కూతురు పుష్పలత అల్లుడు శ్రీనివాస్ గౌడ్ ఇంటికి వచ్చి భోజనం చేసి పెంపుడు కుక్కకు కూడా తీసుకెళ్లేవాడు. ఇలా కొంతకాలంగా జరుగుతోంది. ప్రమాదంలో కొమురయ్య చనిపోవడంతో ఆయన పెంపుడు శునకం అంత్యక్రియ ల్లో పాల్గొన్నప్పటి నుంచి ఆయన సమాధి వద్దే ఉంటోంది. కుటుంబ సభ్యులు ఎన్ని సార్లు ఇంటికి తీసుకు వచ్చినా మళ్లీ సమాధి వద్దకే వెళుతూ అక్కడే ఉంటోంది. సమాధి వద్ద గడుపుతున్న శునకాన్ని చూసిన గ్రామ స్థులు యజమాని పట్ల విశ్వాసంపై చర్చించుకుంటు న్నారు.

అర్ధరాత్రి సీపీ ఆకస్మిక తనిఖీ



కోల్‌సిటీ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా గురువారం అర్ధరాత్రి గోదావరిఖని పట్టణం, రామగుండం రైల్వే స్టేషన్ ప్రాంతాలను ఆకస్మికంగా సందర్శించారు. రైల్వే సిబ్బంది, షాప్‌ల యాజమానులు, ప్రయాణికులతో మాట్లాడారు. పోలీస్ పెట్రోలింగ్ తీరుతోపాటు, మద్యం, వ్యాపార సంస్థల సమయపాలనపై క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఏసీపీ రమేష్, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, రవీందర్, ఎస్ఐ సంధ్యరాణి ఉన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

పాలకుర్తి,జూన్ 5 (ఆంధ్రజ్యోతి): భూ భారతి రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జేరుపోతుల సునీత అన్నారు. గురువారం గుడిపెల్లి, రాణాపూర్ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. మాజీ ఎంపీపీ గంగాధరి రమేష్ గౌడ్, మాజీ సర్పంచ్‌లు కొప్పు పుష్పలత రాజేశం, బాలసాని కుమార్‌గౌడ్, మాజీ ఎంపీటీసి సదానందం పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్, (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహిస్తున్న భూ భారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రాజయ్య అన్నారు. అప్పన్నపేటలో రెవెన్యూ సదస్సు నిర్వహించగా తహసీల్దార్ పాల్గొన్నారు. రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. రాగినేడులో డిప్యూటీ తహసీల్దార్ విజేందర్ బృందం రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. నిమ్మనపల్లి గ్రామంలో దరఖాస్తులను స్వీకరించారు. ఆర్ఐలు భాను, వెంకట రాజిరెడ్డిలతో కార్యదర్శులు పాల్గొన్నారు.

అంతర్గాం, (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం భూ భారతి కార్యక్రమంను నిర్వహిస్తున్నదని రామగుండం తహసీల్దార్ దత్తు ప్రసాద్ అన్నారు. ఆబాది రామగుండంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మాట్లాడారు. రైతులు భూ సమస్యలు పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు. నాయబ్ తహసీల్దార్ ఈశ్వర్, కాంగ్రెస్ నాయకుడు ఈదునూరి హరి ప్రసాద్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలి

మంథని, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని లాయర్స్ ఇండియా ఆర్గనైజేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి పొన్నం రవీందర్, రాష్ట్ర ప్రధాన ప్రధాన కార్యదర్శి ఆలె నర్సింహా, సీనియర్ న్యాయవాదులు అంటోనీరెడ్డి, కుమారస్వామిలు రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలకు వినతి పత్రాలు ఇచ్చినట్లు రాష్ట్ర కన్వీనర్ ఇనుముల సతీష్ గురువారం తెలిపారు.

డివిజన్ల పునర్విభజన పారదర్శకంగా నిర్వహించాలి

కోల్‌సిటీ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): రామగుండం నగర పాలక సంస్థలో డివిజన్ల పునర్విభజన ముసాయిదా నోటిఫికేషన్ గందరగోళంగా ఉందని, పారదర్శకంగా నిర్వహించాలని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేష్ కోరారు. గురువారం కమిషనర్ అరుణశ్రీని కలిసి వినతి పత్రం అందజేశారు. కొన్ని డివిజన్లలో ఓటర్లను పరిగణలోకి తీసుకోకుండా పార్ట్ అని పొందుపర్చడం వల్ల అయోమయానికి దారి తీస్తుందన్నారు. 33వ డివిజన్‌లో ప్రస్తుతం ఫైవింక్లయిన్, పరుశరాంనగర్ ఉండగా 3200ఓట్లు ఉన్నాయని, పరుశరాంనగర్ ప్రత్యేక డివిజన్‌గా సృష్టించి 33వ డివిజన్‌లో సంబంధం లేదని తిలక్‌నగర్, విఠల్‌నగర్ చేర్చారని, ఇది ఎవరి మెప్పు కోసం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత



అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న జీఎం లలిత్ కుమార్

గోదావరిఖని, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యతని ఆర్‌జీ-1 జీఎం లలిత్‌కుమార్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం జీఎం కార్యాలయంలో పర్యావరణ పరిరక్షణపై సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో భూతాపం విపరీతంగా పెరిగిపోతుందని, దీని నివారణకు మొక్కలను నాటాలని అన్నారు. అధికారులు బైద్య, అంజనేయ ప్రసాద్, శ్రావణ్ కుమార్, రాజు, కిరణ్‌బాబు, నాగేశ్వర్‌రావు, వెంకటేశ్వర్‌రావు, అంజనేయులు, కుమారస్వామి, జితేందర్‌సింగ్, సాయిప్రసాద్, ధనలక్ష్మిబాయ్, వరప్రసాద్ పాల్గొన్నారు.

రామగిరి: పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యతగా గుర్తించాలని ఏపీఏ జీఎం నాగేశ్వర్‌రావు అన్నారు. గుర&వారం జీఎం కార్యాలయంలో మాట్లాడారు. అనంతరం వివిధ ప్రాంతాల్లో మొక్కలను నాటారు. అంతకుముందు ఆర్జీ-3, అడ్రియాల ప్రాజెక్టు ఏరియాల్లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం సీఎండీ బలరామ్ నాయక్ సందేశంతో కరపత్రాలను ఆవిష్కరించారు. అధికారులు శేఖర్‌బాబు, శ్రీనివాసులు, రాజారెడ్డి, రామ్మోహన్, సత్యనారాయణ, కళ్యాణ్‌చక్రవర్తి, రాజేంద్రకుమార్, ఐలయ్య, రాజేశ్వరీ, షబ్బిరుద్దీన్, శ్రీహరి, నాయకులు రాంచంద్రరెడ్డి, కొటరవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: జీఎం కార్యాలయం ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో అఫీషియేటింగ్ జీఎం రాముడు మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు సింగరేణి యాజమాన్యం ఏటా లక్షలాది మొక్కలను నాటి సంరక్షిస్తున్నట్టు చెప్పారు. కార్యాలయం పరిసరాల్లో మొక్కలను నాటారు. అధికారుల సంఘం జనరల్ సెక్రెటరీ నర్సింహులు, ఏఐటీయూసీ పిట్ సెక్రెటరీ మహేందర్, అధికారుల సంఘం వైస్ ప్రెసిడెంట్ నరేష్, డీజీఎం పర్సనల్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఓసీపీ-1లో ఉద్యోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పీవో రాజశేఖర్, మేనేజర్ రమేష్ మాట్లాడారు. ప్రతీ ఒక్కరు మొక్కలను నాటాలని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని కోరారు. గుర్తింపు ప్రాతినిధ్య సంఘాల నాయకులు తిరుపతిరావు, గడ్డం తిరుపతి పాల్గొన్నారు.

ఓసిపి-2 ప్రాజెక్టును సందర్శించిన సింగరేణి డైరెక్టర్



ఓసిపి-2 ప్రాజెక్టును సందర్శిస్తున్న డైరెక్టర్

రామగిరి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసిపి-2 ప్రాజెక్టును గురువారం సింగరేణి డైరెక్టర్(ఇఅండ్ఎం) సత్యనారాయణరావు సందర్శించారు. ప్రాజెక్టు వ్యూపాయింట్ నుంచి క్వారీ పనులను పరిశీలించారు. అనంతరం యంత్రాల వినియోగంతోపాటు నిర్దే శించిన లక్ష్యాలను భద్రతా పరమైన అంశాలను తెలుసుకున్నారు. ఓబి వెలికితీతలో రోజువారి లక్ష్యాలను చేరుకొనే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం జీఎం కార్యాలయంలో డైరెక్టర్‌ను సన్మానించారు. అధికారులు విజయశేఖర్, రామ్మోహన్, చంద్రశేఖర్, రామారావు, మహేందర్, షబ్బిరుద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్టీ రోస్టర్ విధానం అమలుపై సమీక్ష

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల పదోన్నతుల్లో ఎస్టీ రోస్టర్ విధానాన్ని అమలు చేయాలని చీఫ్ లైజనింగ్ ఆఫీసర్ వి.కృష్ణయ్య అన్నారు. గురువారం ఆర్జీ-2 జీఎం కార్యాలయంలో ఏరియా అఫీషియేటింగ్ జీఎం రాముడుతో కలసి ఏరియాలో ఎస్టీ రోస్టర్ విధానం అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. రోస్టర్ అమలు విధానాన్ని పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఎస్టీ ఉద్యోగులకు కేటాయించిన పదవులను వారితోనే భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్టీ అసోసియేషన్ నాయకులు భాస్కర్‌రావు, నాగేశ్వరరావు, పంతులు, ఆర్జీ-2 నాయకులు శంకర్ నాయక్, ఉమేష్‌రావు, తిరుపతి, డీజీఎం పర్సనల్ అనిల్ కుమార్, డీవైపీఎం వంశీధర్ పాల్గొన్నారు.

ఎన్సీఓఏ క్లబ్ కార్యవర్గం

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 ఏరియాలోని ఎన్సీఓఏ క్లబ్ కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. క్లబ్ సెక్రెటరీగా ఏరియా సేఫ్టీ ఆఫీసర్ ఎస్ సంతోష్ కుమార్, జూనియర్ సెక్రెటరీగా ఎస్ ఈశ్వర్‌రెడ్డి, ట్రెజరర్‌గా మురళీకృష్ణ కల్చరల్ సెక్రెటరీగా జనార్దన్, స్పోర్ట్స్ సెక్రెటరీగా నర్సింహమూర్తి, లేడీస్ రిప్రెజెంటేటివ్‌గా ఎం.అశ్విని ఎన్నికయ్యారు.

'రాజీవ్ యువ వికాసం' మరింత ఆలస్యం

(5వపేజీ తరువాయి)

ఐదేళ్లలో ప్రభుత్వ పరంగా ఏ కార్పొరేషన్ నుంచి అయినా లబ్ధి పొందారా లేదా అనేది కూడా పరిగణనలోకి తీసుకుంటున్నారు. బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకుని చెల్లించకుండా డిఫాల్టర్‌గా జాబితాలో ఉన్నారా అని పరిశీలిస్తున్నారు. వీటన్నింటినీ అధికారులు పరిశీలించి అర్హులను ఎంపిక చేస్తుండడంతో దరఖాస్తుల పరిశీలన ఆలస్యం అవుతున్నది.

వికాసిత్ కృషి సంకల్ప్ అభియాన్ సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న కేవీకే శాస్త్రవేత్త

రామగిరి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): సుందిల్లా, ఆదివారంపేట్, కల్వచర్ల గ్రామాల్లో వ్యవసాయశాఖ, కేవీకే సంయుక్తంగా గురువారం వికాసిత్ కృషి సంకల్ప్ అభియాన్ సదస్సు నిర్వహించారు. శాస్త్రవేత్తలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. వివిధ వంగడాలు, సహజ వ్యవసాయ పద్ధతులు, ముందస్తు సాగు విధానాలపై వివరించారు. భూసార పరీక్షలు చేయించుకోవాలని, తద్వారా దిగుబడులను పెంచుకొనే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పచ్చిరొట్ట పంటల ఆవశ్యకత, సేంద్రియ, ప్రకృతి వ్యవసాయంలో లాభాలపై వివరించారు. హైదరాబాద్ (ఐసీఏఆర్) ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ నిరంజన్, విష్ణురాజ్, డాక్టర్ కల్పన ఎన్ఎంఆర్ ఐ, పౌల్ట్రీ రీసెర్చ్ శాస్త్రవేత్తలు, కేవీకే శాస్త్రవేత్తలు శ్రీనివాస్, కిరణ్, నవ్య, మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగు లాభదాయకం



ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఎలిగేడు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ పంటను సాగు చేసుకొని అధిక లాభాలు పొందాలని మండల వ్యవసాయ అధికారి ఉమాపతి సూచించారు. గురువారం సుల్తాన్‌పూర్‌లో కొత్తపల్లి ఉదయ్‌కుమార్‌రావు పొలంలో వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు, రైతులు ఆయిల్‌పామ్ మొక్కలను నాటారు. ఒకే పంట విధానాన్ని అవలంబించకుండా అధిక లాభాలనిచ్చే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలన్నారు. ఆయిల్‌పామ్ పంటలతోపాటు అంతర పంటలు వేసుకొని అదనపు ఆదాయం పొందాలన్నారు. హార్టికల్చర్ ఆఫీసర్ మహేష్, ఆయిల్‌పామ్ కంపెనీ సీఈవో, ఏఈవో గణేష్, ఫీల్డ్ ఆఫీసర్ అభిలాష్ రైతులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణ దానంతో సమానం

సుల్తానాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తదానం చేయడం ద్వారా వారి ప్రాణాలు కాపాడిన వారమవుతామని సింగిల్ విండో ఛైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్ అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్ జన్మదినం సందర్భంగా ఆయన అభిమానులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ ఆవరణలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని శ్రీనివాస్ ప్రారంభించారు. రక్తదాతలను అభినందించారు. అంతటి సాగర్, లక్ష్మణ్, అభినవ్, స్నేహిత్, మాజీ కౌన్సిలర్ రాజయ్య, మెంగని శ్రీనివాస్, న్యాతరి మహేందర్ కుమార్, ఆసిఫ్, మధు పాల్గొన్నారు.

ఎంపీ నిధులతో రెండు బోర్లు

పెద్దపల్లి రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : భోజన్నపేటలో ఎంపీ గడ్డం వంశీకృష్ణ నిధుల నుంచి రూ.4 లక్షల వ్యయంతో రెండు బోర్లు మంజూరు చేశారు. గురువారం కాంగ్రెస్ నాయకుడు సతీష్ గౌడ్ పనులు ప్రారంభించారు. మాజీ సర్పంచ్ మేకల మల్లేష్ యాదవ్, యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీకి కనకయ్య రాజీనామా

జ్యోతినగర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఐఎన్‌టీయూసీకి సీనియర్ నాయకుడు బండారు కనకయ్య రాజీనామా చేశారు. ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి, ఆల్ ఇండియా ఎన్టీపీసీ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ ఉపాధ్యక్ష పదవికి, గుర్తింపు కార్మిక సంఘం యూనియన్ ప్రాథమిక సభ్యత్వానికి వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేసినట్లు కనకయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తనకు సహకరించిన ఎన్టీపీసీ ఉద్యోగులు, నాయకులు, ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి, ఎన్‌బీసీ సభ్యుడు బాబర్ సలీం పాషాకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్‌టీవో ఉద్యోగుల పై ఆరోపణలు నిజం కాదు

మంథని, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఎస్‌టీవో కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులపై అవినీతి ఆరోపణలు నిజం కాదని మంథని పెన్షనర్ అసోసియేషన్ అధ్యక్షుడు మారుపాక సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, ప్రతినిధులు చంద్రుపట్ల సుధాకర్‌రెడ్డి, ఖాజానయిమొద్దీన్, కొమురోజు శ్రీనివాస్, రామయ్య గురువారం ఒక ప్రటనలో తెలిపారు. పెన్షన్ దారులు కార్యాలయంలో డబ్బులు ఇవ్వనిదే ఆన్‌లైన్ ప్రక్రియను ఉద్యోగులు చేయడం లేదని సురేష్ ఇచ్చిన ప్రకటనను సంఘం ఖండిస్తోందని పేర్కొన్నారు. పెన్షనర్లకు ఎస్‌టీవో కార్యాలయంలో ఇబ్బందులు లేవని తెలిపారు.

పేదింటి యువతి వివాహనికి చేయూత

పాలకుర్తి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని బామ్లానాయక్ తండాకు చెందిన బాదావత్ గంగమ్మ కుమార్తె అంజలి వివాహం సందర్భంగా తండా మాజీ సర్పంచ్ రాజునాయక్ లక్ష్మీ దంపతులు ఆర్థిక చేయూతనందించారు. వధూవరులను ఆశీర్వదించి 10 వేల రూపాయలు అందజేశారు.

మడేలేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ

జూలపల్లి, జూన్ 5. (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలోని రజక కులస్తుల ఆరాధ్య దైవమైన మడేలేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని గురువారం రజకసంఘం నాయకులు, కులస్తులు నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి పిల్లాపాపలను చల్లంగా చూడాలని వేడుకున్నారు. నగునూరి నారాయణ, శంకరయ్య, గంగిపెల్లి శ్రీనివాస్, భూమయ్య, శంకరయ్య, ముక్కెర శ్రీనివాస్, రాజయ్యగంగయ్య పాల్గొన్నారు.

ఖనిలో ఘనంగా కోలేటి జన్మదినం

గోదావరిఖని, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పోలీస్ హౌసింగ్ బోర్డు మాజీ ఛైర్మన్ కోలేటి దామోదర్ జన్మదినం గురువారం గాంధీనగర్‌లోని ఎండీహెచ్‌డబ్ల్యూఎస్ ఆశ్రమంలో బీఆర్ఎస్ యూత్ నాయకుడు పల్లె రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కేక్‌కట్ చేసి అన్నదానం నిర్వహించారు. కోలేటి సేవాదళ్ సభ్యులు పాణి, శ్రీమాన్, చందర్, నిఖిల్, సుమన్, చోటు, రాంబాబు, పాల్గొన్నారు.

అంతర్గాం, (ఆంధ్రజ్యోతి): తబితా అనాథ ఆశ్రమంలో కోలేటి దామోదర్ జన్మదినాన్ని బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ కన్నూరి సతీష్ కుమార్, మద్ది అన్వేష్‌రెడ్డిలు కేక్ కట్ చేసి అన్నదానం చేశారు. కృష్ణమూర్తి, కోటేశ్వర్, నిర్వాహకుడు వీరేందర్‌నాయక్, పాల్గొన్నారు.